క్లుప్తంగా

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం



రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈఈ కె.శ్రీనివాస్

వీరవాసరం: సార్వా సాగులో ఏ ఒక్క రైతుకు నీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈఈ కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మత్స్యపురి శివారు ప్రాంతాలను బుధవారం ఆయన సందర్శించారు. పంట కాలువ శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామన్నారు. ఎగువ ప్రాంతాల్లోని రైతులు పంట కాలవల నుండి వచ్చే నీటిని సద్వినియోగపరుచుకోవాలని, వృధాగా మురుగు డ్రైవ్‌లోకి నీటిని వదలకూడదని సూచించారు. రైతు సమస్యల పట్ల తక్షణం స్పందిస్తామని చెప్పారు. మత్స్యపురి పంట కాలువ శివారు ప్రాంత రైతుల నుంచి నీటి ఎద్దడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈఈ బీవీ సత్యనారాయణ ఉన్నారు.

మొక్కను నాటు.. ప్రాణాన్ని కాపాడుకో...



చెరుకువాడలో మొక్కలు నాటుతున్న ,సర్పంచ్ సాంబశివరావు

ఉండి: మొక్కలు నాటి ప్రాణాలను కాపాడుకుందామని పీఎంజేఎఫ్ లయన్ జిల్లా గాట్ మెంబర్‌షిప్ కో ఆర్డినేటర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెరుకువాడ జడ్పీ హైస్కూల్ ఆవరణలో క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వేలాది మొక్కలు నాటినట్లు తెలిపారు. అలాగే ప్రతి పాఠశాలలోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. సర్పంచ్ కొండవేటి సాంబశివరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం చిన్న పనిగానే కనిపించినా మొక్క ఎదిగి భావి తరాలకు మంచి ఆరోగ్యం, భవిష్యత్‌ను అందిస్తుందని అన్నారు. మొక్కలు నాటడాన్ని తక్కువ చేసి చూడొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జీవీ కృష్ణంరాజు, రీజినల్ చైర్మన్ దాట్ల కామరాజు, క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ, గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, సాగిరాజు అప్పలరాజు, సత్రి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో అద్దేపల్లి గంగరాజు సత్రం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో అద్దేపల్లి గంగరాజు సత్రం చైర్మన్ అద్దేపల్లి మోహన్‌దాస్ సౌజన్యంతో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వంతో పాటు దాతల సహకారం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు, బొక్క భవానీదుర్గ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో ఇంటింటా సంక్షేమం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- దొడ్డనపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఇంటింటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని డీసీసీబీ చైర్మన్ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు బుధవారం కూడా కొనసాగింది. మహిళలు నర్సింహరాజుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన మాట కోసం కట్టుబడే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని చెప్పారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి కష్టాలను తీరుస్తున్నారని అన్నారు.

కరోనా సమయంలోనూ పథకాల అమలు

కరోనా కష్టకాలంలో కూడా సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చి సంక్షేమ పథకాలను అందించారని పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అనుకున్న సమయానికి అనుకున్నట్టు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారని స్పష్టం చేశారు. సీఎం జగన్ పరిపాలనలో కులమతాలకు అతీతంగా అవినీతికి తావు లేకుండా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో పేదలకు ఒక సెంటు భూమి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని, ఇళ్ల స్థలాలు ఇవ్వడం కాకుండా లబ్ధిదారులకు ఆస్తి హక్కు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్నారని తెలియజేశారు. అటువంటి వలంటీర్ వ్యవస్థపై కూడా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారంటే పేద ప్రజలపై ప్రతిపక్షాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి ఒక్క కుటుంబం సీఎం జగన్‌కి అండగా నిలుస్తారని ధీమా వ్యక్తంచేశారు.

వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేలా..

దొడ్డనపూడి గ్రామం ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకే అనుకూలంగా ఉండేదని, కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో సంతృప్తి చెందిన ప్రజలు వైసీపీకి పట్టం కట్టేలా మాట్లాడుతున్నారని పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా దొడ్డనపూడిలో వైసీపీ మెజార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దొడ్డనపూడి గ్రామంలో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, కాళ్ల సొసైటీ అధ్యక్షుడు సుంకర భోగేశ్వరరావు, ఎంపీటీసీ యర్రింకి కాశీ జగన్నాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుండా సాయి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ పుష్కరిణి అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణి అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త మేడేపల్లి మల్లికార్జునరావు, పావని దంపతుల కుమారుడు మానిష్ చౌదరి రూ.5లక్షలు విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీ దేవి దాతల కుటుంబ సభ్యులకు బాబా ప్రత్యేక దర్శనం కల్పించి శేష వస్త్రం, ప్రతిమతో సత్కరించారు.

మతోన్మాద శక్తులను గద్దె దింపుదాం

దళిత, ప్రజా సంఘాల నాయకులు



భీమవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం : మతోన్మాద శక్తులను గద్దె దింపి, దేశాన్ని రక్షించుకునేందుకు ప్రజలందరూ ఐక్యమవ్వాలని దళిత, ప్రజా సంఘాల జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌక్ నందు కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ కులోన్మాదం, క్విట్ మతోన్మాదం నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత మతోన్మాద భూతం దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రజాసంఘాల నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చర్చలు అనంతరం మతోన్మాద శక్తుల ప్రతులను తగులబెట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ ప్రభుత్వం దళితులు, గిరిజనులపై తన మనువాద మతోన్మాద విధానాలను శరవేగంగా అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులవ్యవస్థను బలోపేతం చెయ్యడమే మోడీ లక్ష్యం అన్నారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో మతోన్మాద శక్తులను గద్దె దించేలా ప్రజలందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జక్కంశెట్టి సత్యనారాయణ, గంటా సుందర్‌కుమార్, డి.కళ్యాణి, డి.పెద్దిరాజు, జి.ధనుష్, బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి వెంకటలక్ష్మి, శేషపు ఆశ్రియ్య, బాతు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ ఆకస్మిక పర్యటన



ఉండిలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

ఉండి: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ఉండి పీహెచ్‌సీ పరిధిలోని ఉండి, కలిసిపూడి, చెరుకువాడ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలిసిపూడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రజలను ఆరా తీశారు. తర్వాత చెరుకువాడలో మిషన్ ఇంద్ర ధనుస్సు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ ద్వారా గర్భిణులకు ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం ద్వారా అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పలువురు గర్భిణులతో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, పోషకాహారం పంపిణీ తీరుతెన్నులను ఆయన పరిశీలించారు. తర్వాత పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ పి.ధర్మతేజ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తిని మరువలేం



వీర జవాన్ గోవర్ధన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: ఎంతో మంది ప్రాణత్యాగంతో వచ్చిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకునేందుకు, దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి పిలుపునిచ్చారు. నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ వద్ద వీర జవాన్ గంట్ల వీవీఎస్ గోవర్ధన్ శిలాఫలకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలంతా దేశభక్తితో మెలగాలన్నారు. మనం చేసే ప్రతి పని దేశానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. అలాగే కాళింగగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల శిలాఫలకాన్ని ఎంపీడీవో కందుల వాణీ, సర్పంచ్ గురువెల్లి అన్నపూర్ణ ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ పుప్పాల పండు, కమిషనర్ జి.కృష్ణమోహన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో సమస్యల పరిష్కారానికి వినతి



కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్ అమలుకు కొత్తగా తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఐసీడీఎస్ అడిషనల్ పీడీ విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో వైట్ల ఉషారాణి, డి.మార్తమ్మ. విజయలక్ష్మి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన 'నా భూమి నా దేశం'



చిలుకూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో అప్పారావు, సర్పంచ్ వెంకట సోమరాజు



రాయకుదురులో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

ఉండి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా భూమి నా దేశం' కార్యక్రమం మండల వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 9 నుండి 15వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని చిలుకూరులో సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు ఆధ్వర్యంలో ఎంపీడీవో ఏవీ అప్పారావు పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన శిలాఫలకాన్ని ఎంపీడీవో, సర్పంచ్ జాతికి అంకితం చేశారు. అనంతరం మట్టితో ప్రమిదలు చేయడం, వీరులకు వందనం, మొక్కలు నాటడం, పంచప్రాణ్ ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీడీవో, సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరమేశ్వరరాజు, ఎంపీటీసీ కరణం త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శి సాత్వికం, వీఆర్వో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యండగండిలో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గోగులమండ చిన కృష్ణమూర్తి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం: నా భూమి నా దేశం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరంలో అసువులు బాసిన వీరులకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో గెడ్డం భారతి, చికిలే మంగతాయారు, నల్లమిల్లి వేణుక, దాసరి మహాలక్ష్మి, వీరవల్లి శ్రీనివాసరావు, కోడి వరలక్ష్మి, మేకల వెంకట చలపతి, సైదు శ్రీనివాసు, శిలబోయిన పద్మ కుమారి, కురెళ్ళ వెంకట పద్మావతి, గడ్డం భాస్కరరావు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపికలు ఏర్పాటు

కాళ్ల: మండలంలో పండగ వాతావరణంలో నా భూమి నా దేశం కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామాల్లో ప్రధాని, ముఖ్యమంత్రి సందేశంతో పాటు అమృత్ సరోవర్ చెరువుల వద్ద స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపికలను ఏర్పాటు చేశారు. సచివాలయల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి



ఉండిలో అధికారులతో సమావేశమైన ఈఆర్‌వో మల్లికార్జునరావు

ఉండి: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 18 ఏళ్లు వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి జీవీ మల్లికార్జునరావు సూచించారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటరు నమోదు కార్యక్రమంపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అలాగే తప్పొప్పులు సరిచేయడం, ఓట్లు బదిలీ, తొలగింపులోనూ పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరం చర్యలు తీసుకోవాలని సూచించారు. గత నెల 21వ తేదీన ప్రారంభమైన ఈ ప్రక్రియ ఈనెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు ఎస్వీఎస్ నాయుడు, టీఏ కృష్ణారావు, ఎస్.విజయలక్ష్మి, షేక్ హుస్సేన్, ఎంపీడీవోలు ఏవీ అప్పారావు, ఎం.గంగాధరరావు, వాణి, స్వాతి, సూపర్‌వైజర్లు,, బీఎల్వోలు పాల్గొన్నారు.

కలిసిపూడిలో రెండు నామినేషన్‌లు

ఉండి : మండలంలోని కలిసిపూడి పంచాయతీ ఎస్సీ రిజర్వుడు 3వ వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నికకు బుధవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు ఎంపీడీవో ఏవీ అప్పారావు తెలిపారు. నామినేషన్‌లకు 11వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. 12వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ, 13వ తేదీ స్క్రూటినీ జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

ఒక నామినేషన్ దాఖలు

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు, కుప్పనపూడి గ్రామాల్లో మూడు వార్డు సభ్యుల ఎన్నికకు బుధవారం అజ్జమూరులో ఒక నామినేషన్ దాఖలైంది. గ్రామంలోని 10వ వార్డు సభ్యుని ఎన్నికకు బుంగా శాంతకుమారి నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్‌ఓ ఏడీఏ కేఎస్ శ్రీనివాసరావు చెప్పారు. కుప్పనపూడిలో ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని ఆర్‌ఓ తెలిపారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న జేఎస్‌వీ గోపాలన్

సాక్షి, భీమవరం: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రస్తుతం దేశంలో నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భీమవరంలో నిర్వహించిన మహాధర్నాలో వక్తలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు, రైతు సంఘం జిల్లా నాయకుడు నరసింహమూర్తి, ఏఐటీయూసీ నాయకుడు చెల్లబోయిన రంగారావు అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎస్‌వీ గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్, లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ నేటి రాజకీయ నాయకులు చెబుతున్న మాటలకు చేస్తున్న పనులకు పొంతన లేదని అన్నారు. ఒక పక్క దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ మరో పక్క ధరలు, పన్నులను పెంచి ప్రజల నడ్డి విరుస్తూ దేశభక్తి అంటూ జబ్బలు చేర్చుకోవడం దారుణమని అన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ దేశభక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో నాయకులు చింతకాయలు బాబురావు, ఎ.అజయ్ కుమారి, డి కళ్యాణి, పీవీ ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, షేక్ వలి, చైతన్య ప్రసాద్, ఎం .రామాంజనేయులు, డి.నాగు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు ఫ్యాన్లు బహూకరణ

సాక్షి, భీమవరం: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయమని పీఎస్‌ఎం గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎం జె.సుధారాణి అన్నారు. పట్టణానికి చెందిన డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల యాజమాన్యం హైస్కూల్‌కు 2 సీలింగ్ ఫ్యాన్లను బహుకరించింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

భీమవరం అర్బన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. భీమవరం రూరల్ పరిధిలోని కొవ్వాడ పుంత గ్రామానికి చెందిన షేక్ కరీబ్ ఉన్నీ సేన్‌కు దుర్గాపురంలోని అబ్దుల్ రహీబ్‌తో వివాహమైంది. ఇటీవల కొంతకాలంగా అబ్దుల్ రహీబ్ తన భార్య కరీబ్ ఉన్నీ సేన్‌ను అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడని ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు.

శేరేపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: మండలంలోని శేరేపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్ సుమారు 60 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం అదే గ్రామంలోని లేవలేని రోగులు ఇంటికి వెళ్లి పరీక్షించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను కూడా పరీక్షించి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రవల్లిక, మదుసూదనరావు, ప్రభాకర్, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ



రాయకుదురులో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భారతి

వీరవాసరం: పరిశుభ్రమైన నాణ్యతతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని రాయకుదురు సర్పంచ్ గెడ్డం భారతి తెలిపారు. గ్రామంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆహారపు కిట్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కె.దుర్గాప్రసాద్, పంపన శ్రీను, గెడ్డం భాస్కరరావు, కె.మేరి, సీహెచ్ పార్వతి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వ్యాయామం చేయాలి

భీమవరం అర్బన్ : గర్భిణులు విధిగా పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని గొల్లవానితిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి లక్ష్మీకాంతం తెలిపారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప అంగన్‌వాడీ కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు ధనలక్ష్మి, లక్ష్మీకాంతం మాట్లాడుతూ గర్భిణులు వారానికోసారి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఐరన్ లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది టీఎల్ఎం తయారు, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.